శిథిలావస్థలో ఎమ్మార్సీ భవనం

- పెచ్చులూడుతున్న స్లాబ్
- ఆందోళనలో ఉపాధ్యాయులు

టేకుమట్ల(రేగొండ): రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన రేగొండ మండల కేంద్రంలోని మానవ విద్యావనరుల కేంద్రం శిథిలావస్థలకు చేరుకుంది. ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు, అధికారిక సమావేశాలు, పాఠశాలకు సంబంధించిన పనుల కోసం మండలంలోని ఉపాధ్యాయులు నిత్యం ఎమ్మార్సీ భవనానికి వస్తుంటారు. కానీ భవనం పైభాగంలో సిమెంట్ పెచ్చులు ఊడిపోతుండడంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారు. ఇక వర్షాకాలంలో భవనంపై వర్షపు నీరు నిల్వ కావడంతో గోడలకు నీరు ఇంకి తడిగా మారి ఎప్పుడు కూలుతుందోనని అని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఎమ్మార్సీ కార్యాలయంలో నిర్వహించే సమావేశాలకు హాజరవుతున్నారు. కాగా, భయాందోళనలో మండల ఉపాధ్యాయులు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలోనే శిక్షణ తరగతులు, సమావేశాలను, కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించుకుంటున్నారు. ప్రతీ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందించే దుస్తులు, పాఠ్యపుస్తకాలు, జావ, బెల్లం ప్యాకెట్లను సైతం ఎమ్మార్సీ భవనంలోనే నిల్వ చేస్తారు. వర్షాకాలంలో తేమ వల్ల ప్రభుత్వం పంపిణీ చేస్తే వస్తువులు పాడయ్యే అవకాశం ఉంది.


రేగొండ ఎమ్మార్సీ భవనం


పెచ్చులుడిన స్లాబ్ పైభాగం


ప్రమాదకరంగా మారిన గోడలు

నిధులు వినియోగించ లేకనే!

మండల విద్యావనరుల కేంద్రాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని, శిథిలావస్థకు చేరుకున్న భవనాన్ని మరమ్మతు చేపించుకునే అవకాశం ఉన్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మరో 20 రోజుల్లో పాఠశాలలకు వేసవి సెలవులు వస్తున్నాయి. కావున విద్యాశాఖ అధికారులు స్పందించి వేసవి సెలవుల్లో మరమ్మతులు చేపించి రానున్న విద్యాసంవత్సరం ఆరంభం వరకైనా ఎమ్మార్సీ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఎమ్మార్సీకి వెళ్లాలంటే భయంగా ఉంది



సమావేశాలు, పాఠశాల అవసరాల కోసం ఎమ్మార్సీకి వెళ్లాలంటే భయంగా ఉంది. స్లాబ్ లోపలి భాగం పెచ్చులు ఊడి ప్రమాదకరంగా ఉండడంతో ఎప్పుడు కూలుతుందో తెలియడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భవనానికి మరమ్మతులు చేపించాలి.

-సతీష్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు

అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం..



ఎమ్మార్సీ భవనంలో భవనంపై పెచ్చులు ఊడి ప్రమాదకరంగా ఉండడాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. భవన మరమ్మతులు చేసేలా కృషి చేస్తా. రానున్న విద్యాసంవత్సరం ఆరంభానికి తప్పనిసరిగా మరమ్మతు చేసేలా అధికారులను కోరుతా.

-వేల్పుల ప్రభాకర్, మండల విద్యాధికారి రేగొండ

అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దు


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై అరుణ్

పలిమెల: గ్రామాల్లో అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దని ఎస్సై అరుణ్ అన్నారు. మండలంలోని సర్వాయిపేటలో కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో గ్రామంలోని ఓ ఇంటి వద్ద గుడుంబా తయారు చేయడాన్ని గుర్తించారు. సుమారు 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 5 లీటర్ల గుడుంబాను సీజ్ చేసి సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశారు. అనంతరం ఎస్సై అరుణ్ గ్రామస్తులతో మాట్లాడుతూ.. గుడుంబా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా యువత జూదం, గుడుంబా, మత్తు పదార్థాల అలవాట్లు మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.


గుడుంబా బట్టీని ధ్వంసం చేస్తున్న ఎస్సై

కంటి పరీక్షలు చేయించుకోవాలి


కాటారం: శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ


మొగుళ్లపల్లి: శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

మొగుళ్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు శిబిరంలో ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని జెడ్పీటీసీ జోరుక సదయ్య అన్నారు. మంగళవారం మండలంలోని ఆకినపల్లిలో వైద్యాధికారిని నాగరాణి, నవిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ మెట్టు వనమాలతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేదలకు వరం కంటి వెలుగని గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాటారం: మండలంలోని ఇబ్రహీంపల్లిలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీడీఓ శంకర్ నాయక్ మంగళవారం పరిశీలించారు. శిబిరం వద్ద సౌకర్యాలు, వైద్య పరీక్షలు కొనసాగుతున్న తీరుపై ఆరా తీశారు. ప్రతి ఒక్కరు వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎంపీడీఓ వెంట సర్పంచ్ దబ్బెట సరోజన, వైద్యుడు డాక్టర్ తిరుపతి, పంచాయతీ కార్యదర్శి శేఖర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు రక్షించవచ్చు


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రమోద్

మహదేవపూర్: సీపీఆర్ ద్వారా గుండెపోటుకు గురైన వారి ప్రాణాలు కాపాడవచ్చని అంబట్‌పల్లి పీహెచ్‌సీ డాక్టర్ ప్రమోద్ తెలిపారు. అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీపీఆర్‌పై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆకస్మికంగా గుండెపోటుకు వస్తే సీపీఆర్ చేయాలన్నారు. కోవిడ్ అనంతరం చాలామంది గుండెనొప్పి కారణంగా మృతి చెందుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం సీపీఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించే ప్రయత్నంలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


తిరుమలగిరిలో పరామర్శిస్తున్న నాయకులు


చిట్యాల: నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ గొర్రె సాగర్

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కట్ల మధుసూదన్‌రెడ్డి తండ్రి సమ్మిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మంగళవారం బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మోడెం ఉమేష్‌గౌడ్, వైస్ ఎంపీపీ కుందూరు విద్యాసాగర్ పరామర్శించారు. వారి వెంట పోచంపల్లి ఎంపీటీసీ కేశిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, నాయకులు మైస భిక్షపతి, తదితరులు ఉన్నారు.

చిట్యాల: మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన క్యాతం రాజ్యలక్ష్మి (57) సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని జెడ్పీటీసీ గొర్రె సాగర్ మంగళవారం పరామర్శించి మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట నరేంద్రాచారి, స్వామి, రఘునందన్, శ్యామ్ సుందర్, గుర్రపు తిరుపతి, చందు, సాంబయ్య, తిరుపతి, రమేష్, పులి రవి, భాస్కర్, తిరుపతి, కుమారస్వామి, అశోక్ ఉన్నారు.

ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు!


ప్రభుత్వ భూమిలో నిర్మాణం జరుగుతున్న ఇల్లు

మహదేవపూర్: మండల కేంద్రంలో ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు జోరుగా సాగుతున్నాయి. దుబ్బగూడెంతో పాటు జాతీయ రహదారికి అనుకొని ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారు. అధికార ప్రజాప్రతినిధులు అధికారులను మచ్చిక చేసుకొని కట్టడాలను నిర్మిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమ కట్టడాలను ఆపాలని మాల మహానాడు ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు ఫిర్యాదు అందినట్లు సమాచారం. ఈ విషయమై తహసీల్దార్ శంకర్‌ను వివరణ కోరగా తమ కార్యాలయం నుంచి ప్రభుత్వ భూమిలో కట్టడాలు కట్టుకునేందుకు ఎవరికి కూడా అనుమతి ఇవ్వలేదని తెలిపారు. ఎవరైనా అక్రమంగా నిర్మాణాలు చేపట్టినచో కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి 30 వరకు 58, 59 జీఓ ద్వారా ప్రభుత్వ భూములు ఆక్రమించుకొని ఇళ్లు నిర్మించుకున్న వారు భూములు క్రమబద్ధీకరణ కోసం సంబంధిత పత్రాలతో మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరణ చేయనున్నట్లు వివరించారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న సేవాలాల్ సేనా సంఘం నాయకులు

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సేవాలాల్ సేనా సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గూగులోత్ సంతోష్ నాయక్ మాట్లాడుతూ.. ఇచ్చిన హామీ ప్రకారం ఎమ్మెల్యే రూ.2 కోట్లు బంజారా భవన్ నిర్మాణానికి కేటాయించారన్నారు. గిరిజనుల చిరకాల కోరికను నెరవేర్చిన వెంకటరమణారెడ్డికి నియోజకవర్గంలోని గిరిజనులు ఎల్లప్పుడు అండగా ఉంటారని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బానోత్ రాజు, నాయకులు జమ్ములాల్, బానోత్ దేవేందర్, రామన్నగూడెం సర్పంచ్ బిక్యా, నంగవత్ రాజేందర్, మహేశ్వర్, భద్రు, భావుసింగ్, చందన్ నాయక్ పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


రవీందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: జిల్లాలోని గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సర్వాయి పాపన్న గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్ గౌడ్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో తాడి కార్పొరేషన్ లోన్ సెక్షన్ అధికారి పాముకుంట్ల రవీందర్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ.. గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు. గీత కార్మికులు ప్రమాదాలకు గురికాకుండా ఉండేందుకు సేఫ్టీ మోకులు అతి త్వరగా అందిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని విన్నవించామన్నారు. దానికి రవీందర్ గౌడ్ సానుకూలంగా స్పందించి వీలైనంత సేఫ్టీమోకులు అందించేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ శ్రీపతి గోపి గౌడ్, బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ అధికారి క్రాంతి కిరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర రమేశ్, జిల్లా నాయకులు పెరుమాండ్ల రవీందర్, సంఘం నాయకులు గుర్రపు తిరుపతి, బోల్లపల్లి సాంబయ్య, గుర్రపు రాజు, మండల అధ్యక్షుడు బుర్ర శ్రీధర్, ఉయ్యాల రమేష్, గొల్లపల్లి రవీందర్, శ్రీపతి రమేష్ పాల్గొన్నారు.

ఉచితంగా పండ్ల మొక్కల పంపిణీ

భూపాలపల్లి/టేకుమట్ల: సంకల్పతరు ఫౌండేషన్ సంస్థ ద్వారా రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలను పంపిణీ చేయనున్నట్లు ఫౌండేషన్ సీనియర్ ఆపరేషన్ కో ఆర్డినేటర్ వాంకుడోతు రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్ట్ పచ్చదనం తెలంగాణలో భాగంగా జిల్లా రైతులు ఒక ఎకరా నుంచి 10 ఎకరాల లోపు జీడి, నిమ్మ, జామ, యాపిల్‌బార్, జామూన్, సీతాఫల్, సపోటా, అంజీర, బాదం, చింత, ఉసిరి, బంగన్‌పల్లి మామిడి, దానిమ్మ, కొబ్బరి మొక్కలు అందించనున్నట్లు తెలిపారు. 5000మొక్కలు తీసుకునే రైతులకు నేరుగా రైతుల పొలాల్లోకి చేరుస్తామని, తక్కువ మొక్కలు గల రైతులు జిల్లా కేంద్రానికి వచ్చి తీసుకెళ్లాలని సూచించారు. రవాణా ఖర్చులను సైతం సంకల్పతరు ఫౌండేషన్ సంస్థ భరిస్తుందన్నారు. రైతులు వాణిజ్య పంటలతో పాటు, పండ్ల తోటలను పెంచి ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. వివరాలకు 95531 62977 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రానున్న రోజుల్లో కాంగ్రెస్‌దే అధికారం

మహదేవపూర్: రానున్న రోజుల్లో రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్‌దే అధికారమని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి విలాస్‌రావు అన్నారు. మండలంలోని అంబట్‌పల్లిలో మంగళవారం యువజన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడో యాత్రతో ప్రజల మనస్సులో కాంగ్రెస్ స్థానం మరింత పెరిందని అన్నారు. రానున్న రోజుల్లో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంథని నియోజకవర్గంలో సభ్యత్వాలను మరింత పెంచి అగ్రస్థానంలో నిలవాలని సూచించారు. యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాహుల్, మండలాల అధ్యక్షులు అశోక్, సందీప్, రాజేందర్, క్రాంతి, ప్రవీణ్, శివకుమార్ పాల్గొన్నారు.

మిత్రుడికి చేయూత


ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు గుర్రపు గట్టయ్య ఇటీవల తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి పడడంతో అతని వెన్నుపూస బొక్క విరిగిపోయింది. దీంతో అతడితో కలిసి పదో తరగతి చదువుకున్న 40 మంది మిత్రులు కలిసి రూ.51,500 సాయం అందజేశారు. ఆకుల సతీష్, గంగాధర్ రాజు, బోళ్ల రాజేందర్, బుర్ర రాజు, బోయిని తిరుపతి, దబ్బెట రాజు, బుర్ర శ్రీధర్ గౌడ్, తుమ్మల రమేష్, గంపల మధుకర్, లటికే రాజు, బుట్టి కుమార్, రాజు, సకినాల ప్రభాకర్, శ్రీనివాస్, కిష్టయ్య ఉన్నారు.

ఓవర్ లోడ్‌తో వెళ్తున్న లారీ సీజ్

మల్హర్: మండలంలోని మల్లారం ఇసుక రీచ్ వద్ద నుంచి ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీని సీజ చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. తహసీల్దార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓవర్ లోడ్‌తో ఇసుక తరలిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. స్థాయికి మించి లోడ్‌తో వెళ్తున్న ఓ లారీని గుర్తించి సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. రాత్రి సమయం కావడంతో నేడు(బుధవారం) పంచనామా నిర్వహించి జరిమానా విధించనున్నట్లు స్పష్టం చేశారు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి, మొగుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న పదో తరగతి పరీక్షలు రెండో రోజు కొనసాగాయి. మండలంలో మొత్తం 261 మంది విద్యార్థులకు వంద శాతం హాజరైనట్లు ఎంఈఓ ప్రభాకర్ తెలిపారు.

టేకుమట్ల/రేగొండ: పదవ తరగతి వార్షిక పరీక్షలు మంగళవారం రెండవ రోజు ప్రశాంతంగా కొనసాగినట్లు టేకుమట్ల, రేగొండ మండల విద్యాధికారులు కోడెపాక రఘుపతి, వేల్పుల ప్రభాకర్ తెలిపారు. టేకుమట్ల పరీక్ష కేంద్రంలో 150కి 150 మంది విద్యార్థులు, రేగొండ, రంగయ్యపల్లి సెంటర్లలో 384 మంది విద్యార్థులకు 384 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. కాగా పరీక్ష కేంద్రాలలో స్కాడ్ తనిఖీలు చేపట్టారు.

తాడిచర్లలో గ్రామసభ


జాబితా వివరాలను చదివి వినిపిస్తున్న రెవెన్యూ అధికారులు

మల్హర్: జెన్‌కో భూసేకరణ పనుల నిమిత్తం మండలంలో తాడిచర్ల గ్రామ పంచాయతీలో భూపాలపల్లి ఆర్డీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. తాడిచర్ల శివారులో ఆర్ అండ్ఆర్ కాలనీ ఏర్పాటుకు తాడిచర్లలో 7.26 ఎకరాల భూమి సేకరణకు, కాపురం గ్రామంలో 6.3 1/2 ఎకరాల విడుదలైన నోటిఫికేషన్‌పై విస్తీర్ణం, లబ్ధిదారుల పేర్లను గ్రామ సభలో రెవెన్యూ అధికారులు చదివి వినిపించారు. జాబితాలో పేర్ల వివరాలు, విస్తీర్ణం నమోదుల్లో వ్యత్యాసాలు ఉంటే లిఖిత పూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ సరిత తదితరులు పాల్గొన్నారు.

శిఖం భూమి పరిశీలన


పరిశీలిస్తున్న అధికారులు

కాటారం: మండల కేంద్రంలోని ఊర చెరువు శిఖం భూమిని తహసీల్దార్ జివాకర్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈఈ సతీశ్ మంగళవారం పరిశీలించారు. చెరువు శిఖం పూర్తి విస్తీర్ణం, వినియోగం తదితర వివరాలపై ఆరా తీశారు. శిఖం భూమి సర్వే చేసి పూర్తి స్థాయిలో హద్దులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శిఖం భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకొంటున్నట్లు పేర్కొన్నారు. ఏఈఈ సతీశ్, సర్వేయర్లు ఉన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం


వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న హరిబాబు

మహదేవపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శ్రీ సీతారామ సేవాసదన్ మంథని వారి ఆర్థిక చేయుతతో నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను ఆ సంఘం అధ్యక్షుడు హరిబాబు, కోశాధికారి హరి మంగళవారం ప్రారంభించారు. ప్లాంట్ మొత్తం ఖర్చు రూ.1,60,000 ఉంటుందని, సేవాసదన్ నుంచి రూ.80,000 ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. అనంతరం కళాశాల నేమ్ బోర్డు ఆవిష్కరించారు. జన్ను విజయ్ కుమార్, రమేష్, మున్నయ్య, డాక్టర్.శ్రీనివాస్, రజిత, రాజేందర్, పరుశురాములు, రమేష్, అస్రా, నాన్ టీచింగ్ స్టాఫ్ వేణుగోపాల్, వెంకటయ్య, రవీందర్, కరీంబి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలుపు మొక్కలను తొలగించాలి



మహాముత్తారం: నర్సరీల్లో కలుపు మొక్కలను తొలగించి మొక్కలకు క్రమం తప్పకుండా నీళ్లు పట్టాలని ఎంపీడీఓ పెద్ది ఆజనేయులు పంచాయతీ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండలంలోని గండికామారం గ్రామ పంచాయతీలోని వన నర్సరీతో పాటు అవెన్యూ ప్లాంటేషన్, పల్లెప్రకృతివనం నర్సరీలను పరిశీలించారు. నర్సరీల్లో పెద్దగా పెరిగిన మొక్కలను షిఫ్టింగ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివశంకర్, ఫీల్డ్అసిస్టెంటు రాజు తదితరులు ఉన్నారు.

నియామకం



మల్హర్: బీజేపీ మంథని నియోజకవర్గ కన్వీనర్‌గా మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన మల్క మోహన్‌రావును మంగళవారం నియమించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి, రాష్ట్ర నాయకుడు, మంథని నియోజక వర్గం ఇన్‌చార్జ్ చందుపట్ల సునీల్‌రెడ్డి, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు కన్నం యుగదీశ్వర్, వెన్నంపల్లి పాపన్న, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కమిటీ ఎన్నిక



మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మహిళ గ్రామ కమిటీని మాజీ జెడ్పీటీసీ కొండ రాజమ్మ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా భాను, ఉపాధ్యక్షురాలుగా కవిత, ప్రధాన కార్యదర్శిగా స్వప్న, కోశాధికారిగా ప్రమీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్హర్ రావు, గ్రామశాఖ అధ్యక్షుడు చంద్రయ్య, ఉపసర్పంచ్ చంద్రయ్య, మధు, రాజసమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

6న బీసీ జర్నలిస్టుల సమావేశం

భూపాలపల్లి: 6న తేదీన బీసీ జర్నలిస్టుల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం జిల్లా నాయకుడు సామల శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని కాకతీయ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి జిల్లాలో వివిధ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో పని చేస్తున్న జర్నలిస్టులు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఇతర సమస్యల పరిష్కారం కోసం చర్చిస్తామని శ్రీనివాస్ తెలిపారు.

కేసు నమోదు

మహాముత్తారం: వాట్సాప్ గ్రూపులో అనుచిత వాఖ్యలు పోస్టు చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసులు తెపిన వివరాల ప్రకారం.. మాదారం గ్రామానికి చెందిన అల్లావొద్దీన్ అనే వ్యక్తి కొర్లకుంట సర్పంచ్ ముక్కెర నవీన్‌పై వాట్సాప్ గ్రూపుల్లో అనుచిత వ్యాఖ్యాలతో పాటు లేనిపోని నిందలు పోస్టు చేసినందుకు సర్పంచ్ పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. గ్రామాల్లో ఎవరైన ప్రచార మాధ్యమాలలో లేనిపోని మాటలు, అనుచిత వాఖ్యాలు దుష్ప్రచారాలు చేస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

కుందనపల్లిలో 'బలగం'


చిత్రాన్ని వీక్షిస్తున్న ప్రేక్షకులు

టేకుమట్ల: కుటుంబ బంధాలు, వాటి విలువలపై నిర్మించిన చిత్రమే బలగం. గ్రామీణ ప్రాంత నేపథ్యంలో నిర్మించిన ఈ సినిమా ప్రతీ ఒక్కరిని ఆలోచింపజేసిన చిత్రంగా నేడు అందరి ఆదరణ పొందుతున్న తరుణంలో మండలంలోని కుందనపల్లిలో మంగళవారం రాత్రి ప్రదర్శించారు. సీఐ పింగిళి ప్రశాంత్‌రెడ్డి అమ్మమ్మ ఊరైన కుందనపల్లిలో సొంత ఖర్చులతో బలగం చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.